ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

సంపుటి - 03 సంచిక -126 పేజీలు - 04 వెల - 04/- బుధవారం 10 జూన్ 2026

# ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్ ఫోర్స్



- పనితీరు ఆధారంగా శాఖలకు స్కోరింగ్
- వివిధ శాఖలకు కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు నిర్దేశించిన సీఎం
- పనితీరు ఆధారంగా స్కోరింగ్ విధానం అమలుకు నిర్ణయం
- ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికల రూపకల్పన
- ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్ ఫోర్స్ ఏర్పాటుపై ఆలోచన
- 2047 స్వర్ణాంధ్ర లక్ష్య సాధన కోసం డేటా ఆధారిత పాలనపై దృష్టి



**అమరావతిజూన్ 09,ఆంధ్ర ప్రగతి**

అన్ని రంగాల్లో అభివృద్ధిని మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జీఎస్‌డిపి, జివిఎలపై ప్రణాళిక శాఖతో పాటు ఇతర శాఖల అధికారులతో అయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ శాఖల్లో కీ పెర్ఫార్మన్స్ ఇండికేటర్లపై దిశానిర్దేశం చేశారు.**మిగతా 2లో...**



# అండగా ఉంటాం

## స్టీల్ ప్లాంట్ బాధిత కుటుంబాలకు పవన్ ,లోకేశ్ పరామర్శ

- అధికారుల నుంచి వివరాలు ఆరా
- కిమ్స్ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన డిప్యూటీ సీఎం
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ
- నిపుణుల కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు
- త్వరలో కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహిస్తానని వెల్లడి



# విద్యార్థులను సవాళ్లకు సన్నద్ధం చేయాలి

డిజిటైలేజేషన్, ఏఐలదే కీలక భూమిక -టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ సాగాలి

విక్రమ సింహపురి స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల నజీర్ పిలుపు



# అంతర్జాతీయ స్థాయికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్‌తో ఎంఓయూ

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్

**రాజమహేంద్రవరం,జూన్ 09,ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింతగా విస్తరించే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఏపీ టూరిజం శాఖ, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ మధ్య చరిత్రాత్మక అవగాహన ఒప్పందం కుదిరింది. ఆంధప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. విశాఖపట్నంలో సెప్టెంబర్ 10 నుంచి 12 వరకు 41వ ఐఏటీవో వార్షిక సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నారు. ఈ వార్షిక సదస్సు సందర్భంగా ఒప్పందం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా పర్యాటక రంగానికి చెందిన ప్రముఖులు,**మిగతా 2లో...**






# స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రల వల్లే ప్రమాదాలు

: బొత్స సత్యనారాయణ

- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో ఎనిమిది మంది చనిపోవడం బాధాకరమన్న బొత్స
- బాధితులు కోరుతున్న పరిహారం ఇవ్వాలని వ్యాఖ్య
- మృతుల కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం

# కాంగ్రెస్‌కు షాక్

రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ



**న్యూఢిల్లీ: జూన్ 09,ఆంధ్ర ప్రగతి**

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ స్థానానికి బరిలో నిలిపిన కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి మంగళవారం నాడు తిరస్కరించారు. ఆమె తన అఫిడవిట్‌లో ఒక క్రిమినల్ కేసు వివరాలను దాచిపెట్టారని బీజేపీ ఆరోపించడంతో నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో బిజెపికి చెందిన**మిగతా 2లో...**

# మహిళా సాధికారతకు మరో ముందడుగు

- మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ
- ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు పెద్దపీట
- వారిని కోటీశ్వరులను చేసే పనిలో వెనకడుగు లేదు
- మహిళల స్ఫూర్తితోనే తమ ప్రజాపాలన సాగుతోంది
- వారి దెబ్బకే కొందరు ఫ్మామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు
- కెసిఆర్ హయాంలో మంత్రి పదవులు కూడా ఇవ్వలేదు
- బిజెపి కనీసం మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదు
- పరేడ్ గ్రౌండ్స్ సభలో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,జూన్ 09,ఆంధ్ర ప్రగతి**

మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని వ్యాఖ్యానించారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం ప్రారంభించి ప్రసంగించారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోని తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి**మిగతా 2లో...**

# ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని నిరూపిస్తావా

నిరూపిస్తే వెంటనే రాజీనామా చేస్తా

సిఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి సవాల్



**న్యూఢిల్లీ,జూన్ 09,ఆంధ్ర ప్రగతి**

తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను తాను అడ్డుకుంటున్నానని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం సాధించినా తెలంగాణ ప్రజల బతుకులు మాత్రం మారలేదంటూ కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.**మిగతా 2లో...**

# ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్ ఫోర్స్

మొదటిపేజీ తరువాయి

అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వివిధ ప్రభుత్వ శాఖలకు కీ పెర్ఫార్మెన్సు ఇండికేటర్లపై లక్ష్యాలను నిర్దేశించారు. ఇప్పటికే పలు శాఖల్లో జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్న సూచికలను మెరుగు పరచి అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా చేరుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. నిర్దేశించుకున్న లక్ష్యాలతోపాటు వాస్తవిక వృద్ధి ఆధారంగా పనితీరును అంచనా వేసేలా స్కోరింగ్ విధానాన్ని అమలు చేయాలని స్పష్టం చేసారు. అలాగే రాష్ట్ర, క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇదే సమయంలో మౌలిక సదుపాయాలపై చేసే వ్యయంపైనా సమీక్షించారు. ఈ రంగంపై చేసే వ్యయంలో కనీసం 3.5 రెట్ల వరకు ఆర్థిక కార్యకలాపాలు జరిగేలా ప్రోత్సాహం అందించాలన్నారు. రియల్ టైమ్ లో ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారంగా టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలని సూచించారు. 2047 వరకు నిర్దేశించుకున్న స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా గవర్నెన్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని రంగాల్లో సమగ్ర వాల్యూ అడిషన్ పెంచేందుకు శ్రద్ధ పెట్టాలన్నారు. ఉత్పాదక రంగం, తయారీ, గనులు, వాణిజ్యం, రవాణా వంటి రంగాలపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు, పోర్టులు, ఎయిర్ పోర్టులతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేసేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ రంగాల్లో కేపీఐలు ఎంత మెరుగ్గా ఉంటే వృద్ధి రేటు కూడా అంతగా పెరుగుతుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. జీఎస్డీపి పైన అధికారులతో చర్చించారు. అన్ని శాఖల్లో నిర్దేశించిన వృద్ధిని సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు**

ఎన్డిఎ, నీతి ఆయోగ్ సమావేశాలకు హాజరు సిఎం చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటనకు ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ నెల 10, 11వ తేదీల్లో సిఎం ఢిల్లీలో ఉండనున్నారు. 10వ తేదీ బుధవారం నాడు ఉదయం 11:30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీ బయలుదేరి వెళతారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఎన్డిఎ భాగస్వామ్య పక్షాల సమావేశానికి ఆయన హాజరవుతారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ సమావేశంలో పాల్గొంటారు. 11వ తేదీ గురువారం నాడు రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొంటారు. ఉదయం 9:15 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సమావేశం జరగనుంది. అనంతరం ఢిల్లీ నుంచి బయలుదేరి రాత్రి 9 గంటలకు సిఎం చంద్రబాబు అమరావతి చేరుకుంటారు.

# అండగా ఉంటాం

## స్టీల్ ప్లాంట్ బాధిత కుటుంబాలకు పవన్ ,లోకేశ్ పరామర్శ



**విశాఖపట్నం,జూన్ 09ఆంధ్ర ప్రగతి** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. మంగళవారం ఉదయం కేజీహెచ్ ఆస్పత్రికి చేరుకున్న మంత్రి.. మార్చురీలో ఎంతమంది ఉన్నారనే దానిపై జాయింట్ కలెక్టర్ విద్యాధరిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో చనిపోయిన ఎమినిది మంది బంధువులను పరామర్శించారు. వారి నుంచి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆపై సెవెన్ హిల్స్ ఆస్పత్రికి మంత్రి వెళ్లారు. స్టీల్ ఎ÷-లాంట్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సూరిబాబు, పైడిరాజు, పి.శ్రీనివాసరావు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని, ఆసుపత్రిలో అందుతున్న చికిత్సను వైద్యులను అడిగి తెలుసుకున్నారు . అనంతరం గాయపడిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని లోకేశ్ చెప్పారు. మంత్రి లోకేశ్‌తో పాటు కేంద్రమంత్రి భూపతి రాజు, హోంమంత్రి అనిత, ఎంపీ భరత్, పల్లా శ్రీనివాసరావు.. వాసంసెట్టి బాధితులను పరామర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం జరిగింది. లాడిల్ నుంచి ద్రవ ఉక్కు బకెట్లు కింద పడిపోయాయి. పలువురు కార్మికులపై ద్రవ ఉక్కు పడి అక్కడికక్కడే బూడిదయ్యారు. ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోయి



గుర్తుపట్టలేని విధంగా మారాయి. అటు ఎనిమిది మృతదేహాలను పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. మృతదేహాలను గుర్తించేందుకు మృతుల బంధువుల శాంపిల్స్‌ను తీసుకుని ల్యాబ్‌కు పంపిస్తామని వైద్యులు చెబుతున్నారు. డీఎన్ఏ పరీక్షలు పూర్తయ్యేందుకు నాలుగు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారు విశాఖలోని కిమ్స్, సెవెన్ హిల్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖకు చేరుకున్న ఆయన కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులను స్వయంగా అడిగి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. అనంతరం స్టీల్ ప్లాంట్‌లోని ప్రమాద స్థలాన్ని పరిశీలించి యాజమాన్యం, ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 10 లక్షల చొప్పున సాయం అందిస్తామని, వారి పూర్తి చికిత్స ఖర్చులను ఆర్.ఐ.ఎన్.ఎల్. భరిస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం కల్పిస్తామన్నారు. పదవీ విరమణ ప్రయోజనాల కింద రెగ్యులర్ ఉద్యోగులకు రూ. 1.72 కోట్లు, కాంట్రాక్టు ఉద్యోగులకు రూ. 45.75 లక్షలు అందుతాయని వివరించారు. మృతుల పిల్లల చదువులకు కూడా యాజమాన్యం సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.గత 30 ఏళ్లలో ఇలాంటి ఘోర దుర్ఘటన జరగలేదని పవన్ పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన ముందు రోజు రాత్రి కూడా ప్లాంట్‌లో ఇలాంటి చిన్న సాంకేతిక లోపం తలెత్తిందని, అయితే రాత్రి వేళ కార్మికులు ఎవరూ లేకపోవడం వల్ల ఎవరికీ తెలియలేదని తన దృష్టికి తెచ్చారని ఆయన వివరించారు. ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలు, యంత్రాల ఆధునికీకరణపై దర్యాప్తు చేయడానికి ఒక ప్రత్యేక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని, వారి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.స్టీల్ ప్లాంట్ కార్మికుల సమస్యలపై, వారి భద్రతపై త్వరలోనే ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి స్వయంగా కార్మికులతో మాట్లాడతానని పవన్ హామీ ఇచ్చారు. ఇలాంటి ఘోర ప్రమాదాలు జరిగినప్పుడు కేవలం బాధపడి వదిలేయకుండా.. ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ కల్పించేందుకు యాజమాన్యం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# మహిళా సాధికారతకు మరో ముందడుగు

మొదటిపేజీ తరువాయి

ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని ప్రస్తావించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. మహిళా సంఘాల్లో 67 లక్షల మంది ఆడబిడ్డలు ఉన్నారని తెలిపారు. ఆడబిడ్డలతో పెట్టుకుంటే అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. తమ అక్కలు పెట్టిన వాతలతోనే కొందరు ఫామ్‌హౌస్‌లో పండుకున్నారని విమర్శించారు. ఉచిత బస్సుతో స్కూళ్లలో ఆడపిల్లల డ్రాపౌట్స్ తగ్గాయని అన్నారు. ఉచిత బస్సు పథకం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కడుపు నిండా విషం పెట్టుకుని ఉచిత బస్సు పథకం ఆపాలని కొంతమంది చూశారని ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి రోడ్డుపైకి పంపారని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు. 27 వేల స్కూళ్ల నిర్వహణ బాధ్యత కూడా ఆడబిడ్డలకు అప్పగించామని తెలిపారు. మిడ్ డే మీల్ పథకం సరుకులు కూడా మహిళలే సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. పెట్రోల్ బంకుల నిర్వహణ అప్పగించడంతో లక్షలు సంపాదిస్తున్నారని చెప్పుకొచ్చారు. 8 వేల స్త్రీ శక్తి భవనాలు ఒకేసారి పూర్తిచేస్తామని అన్నారు. కార్పొరేట్ ఆఫీస్‌ల కంటే మిన్నగా స్త్రీ శక్తి భవనాలు ఉంటాయని వివరించారు. హైటెక్ సిటీ దగ్గర మహిళలకు రూ.1000 కోట్ల భూమి కేటాయించామని ప్రస్తావించారు. 106 స్టాల్స్‌తో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో మాల్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. దళారులు, దోపిడీదారులకు తమ ప్రభుత్వంలో చోటులేదని స్పష్టం చేశారు. 2034 వరకు ప్రజాప్రభుత్వం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు అండగా ఉండే బాధ్యత తమదని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మహిళా సంఘాలను ఆదుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రూ.60 వేల కోట్ల రుణాలతో ఆర్థికంగా నిలబెడుతున్నామని తెలిపారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలని మంచి చీరలు ఇస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన చీరలను ఎవరైనా కట్టుకున్నారా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల సంక్షేమానికి అన్నివేళలా కృషిచేస్తామని తెలిపారు. పంట మార్పిడి విషయంలో మహిళలు చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

మన సంస్కృతి, సంప్రదాయల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుంది. మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును గత ప్రభుత్వం చెల్లించలేదు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయింది. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం' అన్నారు. అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారు. వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలు. ఆడబిడ్డ పుడితే.. మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనది. మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తిపు ఉంది. మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుంది. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని మేం పరిపాలన చేస్తున్నాం. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టింది. భారత్‌కు స్వాతంత్య్రం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకే దక్కుతుందని రేవంత్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారు. సోనియా గాంధీ 2013లో చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లు ప్రవేశపెట్టారు. అంబానీ, ఆదానీలకు పోటీగా పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే మహిళా శక్తి భవనాలు నిర్మిస్తామని అన్నారు.

# స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రల వల్లే ప్రమాదాలు

**: బొత్స సత్యనారాయణ**

**జూన్ 09,ఆంధ్ర ప్రగతి**

విశాఖ స్టీల్ ప్లాంట్ ఘోర ప్రమాదంలో గాయపడి కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వైసీపీ నేతలు బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, కేకే రాజులతో కూడిన బృందం పరామర్శించింది. అనంతరం మీడియాతో బొత్స మాట్లాడుతూ... ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు చనిపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. బాధితులు కోరుతున్న పరిహారం గొంతెమ్మ కోరిక కాదని, ప్రభుత్వం వారి డిమాండ్లను తక్షణమే అంగీకరించాలని చెప్పారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి స్టీల్‌ప్లాంట్‌ను తమ తాబేదార్లకు కట్టబెట్టేందుకు, ప్రైవేటీకరణ చేసేందుకే కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఈ కుట్రల వల్లే ప్లాంట్‌లో వరుస ప్రమాదాలు జరుగుతూ కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ నుంచి సమర్థులైన, అనుభవజ్ఞులైన అధికారులను దొడ్డిదారిన బదిలీ చేయడం వల్లే ఈ భారీ ప్రమాదం చోటుచేసుకుందని బొత్స విమర్శించారు. ఇప్పటికే దాదాపు 10 వేల మంది శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులను అన్యాయంగా తొలగించారని, ఇకనైనా బలవంతపు వీఆర్ఎస్ చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు 'ఎల్జీ పాలిమర్స్‌తరహాలో కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని, ఈ విషయంలో వైసీపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చి చెప్పారు. అలాగే, బాధితులను పరామర్శించేందుకు జగన్ రేపు విశాఖలో పర్యటిస్తారని వెల్లడించారు.

# కాంగ్రెస్‌కు షాక్

మొదటిపేజీ తరువాయి

మహేష్ కేవత్ ఏకగ్రీవంగా ఎన్నికవడం ఖాయమైంది. తెలంగాణలో కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఒక కేసుకు సంబంధించిన వివరాలను మీనాక్షి తన అఫిడవిట్‌లో పేర్కొనలేదని, అందువల్లే ఆమె నామినేషన్‌ను తిరస్కరించామని ఎన్నికల అధికారులు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అధిష్టాన పెద్దలు కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) అధికారులను కలిసి విజ్ఞప్తి చేయనున్నారు. కాగా కాంగ్రెస్ విజ్ఞాపనపై బుధవారం నాడు సిఇసి స్పందించేవీలుంది.

కర్ణాటకకు చెందిన మీనాక్షి నటరాజన్..కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి సన్నిహితురాలిగా పేరొందారు. ఆమె యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలుగా పనిచేశారు. ఈ స్థానంలో పార్టీ సీనియర్ నాయకులు దిగ్విజయ్ సింగ్‌కు బదులుగా మీనాక్షిని బరిలోకి దించడంపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సింగ్‌కు బదులుగా మీనాక్షిని బరిలోకి దించితే, కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బిజెపికి ఓటు వేయవచ్చని సీనియర్ నేత నరేష్ జ్ఞాన్‌చందాని ఇదివరకే పేర్కొన్నారు. రాష్ట్ర నాయకత్వంతో సరైన సంప్రదింపులు జరపకుండా మీనాక్షిని బరిలోకి దించడం తగదని జ్ఞాన్‌చందాని సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఈ నేపథ్యంలోనే సోమవారం నాడు మీనాక్షి నామినేషన్ దాఖలు చేశారు. ఆ వెంటనే జ్ఞాన్‌చందాని కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. దీంతో కేవలం రెండు సీట్లు మాత్రమే గెలిచే అవకాశం ఉన్న బిజెపి, మూడో సీటుకు తన అభ్యర్థిని ప్రకటించింది. తాజా పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బెంగళూరులోని ఒక రిసార్ట్‌కు తరలించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

# అంతర్జాతీయ స్థాయికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం

మొదటిపేజీ తరువాయి

అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొనే ఈ సదస్సు రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకునుందని టూరిజం శాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి విజన్‌కు అనుగుణంగానే ఐఏటీవోతో భాగస్వామ్యం ఏర్పడిందన్నారు. 41వ ఐఏటీవో వార్షిక సదస్సుకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం ఏపీకి గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. సీఎం ఆదేశాల మేరకు జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. విశాఖలో జరిగే ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలోని బీచ్‌లు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి సౌందర్య ప్రాంతాలు, వారసత్వ సంపద వంటి పర్యాటక విశేషాలు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం లభిస్తుందని మంత్రి దుర్గేశ్ చెప్పారు. ఒప్పందం ద్వారా ఏపీకి విదేశీ పర్యాటకుల రాక గణనీయంగా పెరుగుతుందని మంత్రి దుర్గేశ్ వివరించారు. సెప్టెంబర్‌లో జరిగే సదస్సుకు దాదాపు వెయ్యి మంది అంతర్జాతీయ టూరిజం ప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక టూర్ ఆపరేటర్లకు ప్రోత్సాహంగా ఐఏటీవో సభ్యత్వ నమోదు ఫీజులో 50 శాతం ప్రత్యేక రాయితీ కల్పించడంతో పాటు రూ.10వేల జాయినింగ్ ఫీజును పూర్తిగా మినహాయించినట్లు దుర్గేశ్ వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పర్యాటక రంగంలో ఇప్పటికే రూ.20 వేల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించగలిగామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వంపై పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరగడంతో భారీ ప్రాజెక్టులు ముందుకు వస్తున్నాయని మంత్రి దుర్గేశ్ చెప్పుకొచ్చారు. ఏపీలో పర్యాటక రంగం అభివృద్ధి చెందితే ఆర్థిక వృద్ధితో పాటు ఉపాధి అవకాశాలూ పెరుగుతాయని మంత్రి దుర్గేశ్ స్పష్టం చేశారు. ఈ సదస్సు జాతీయ ట్రావెల్ ట్రేడ్, పర్యాటక రంగ అగ్రనేతల సమక్షంలో ఏపీలోని వైవిధ్యభరితమైన పర్యాటక అవకాశాలను ప్రదర్శించేందుకు అరుదైన వేదికగా నిలవనుందని మంత్రి దుర్గేశ్ అభిప్రాయపడ్డారు.

# ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని నిరూపిస్తావా

మొదటిపేజీ తరువాయి

అప్పులు తెచ్చి సోకులు చేస్తున్నారంటూ గత బీఆర్ఎస్, ప్రస్తుత రేవంత్ సర్కార్ తీరును ఆయన ఎండగట్టారు. హైదరాబాద్‌లో భూములు మిగిలే పరిస్థితి లేదన్నారు. మంత్రులతోపాటు అందరూ భూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని చెప్పారు. ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వానికి లేదన్నారు.సీఎం రేవంత్ రెడ్డి బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కానన్నారు. సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డిలాగా తాను మాటకారిని కాను.. కానీ మాటపై నిలబడే వ్యక్తిని అని కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. పదవులు, అధికారం కోసం మాటలు మార్చే వ్యక్తిని తాను కానని స్పష్టం చేశారు. చిల్లర రాజకీయాలు చేయడం తనకు అలవాటు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని అధికార పార్టీ నేతలకు కిషన్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. మీరిచ్చిన ఏ గ్యారంటీ అయినా అమలు చేశారా? అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని వ్యంగ్యంగా అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం, ప్రజలను వంచించడంలో.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలను సీఎం రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను గమనించాలంటూ తెలంగాణ సమాజానికి ఈ సందర్భంగా సూచించారు. సీఎం రేవంత్‌కు తాము గులాంలు కామన్నారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# విద్యార్థులను సవాళ్లకు సన్నద్ధం చేయాలి

**నెల్లూరు,జూన్ 09,ఆంధ్ర ప్రగతి**

ప్రస్తుత కాలంలో డిజిటల్ పరివర్తన, కృత్రిమ మేధస్సు ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. ఉన్నత విద్యాసంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించి విద్యార్థులను భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలంటే డిజిటల్ విద్యను విస్తృతంగా వినియోగించాలని తెలిపారు. మంగళవారం నెల్లూరు జిల్లాలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవ సభకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విశ్వవిద్యాలయం గత పదిహేడేళ్లుగా నాణ్యమైన విద్య, పరిశోధన, సామాజిక సేవల ద్వారా విశేష ప్రగతి సాధించిందని గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయం ఇటీవల నాక్ నుంచి 3.23 సీజీపీఏతో 'ఎ' గ్రేడ్ సాధించడం గర్వకారణమని ప్రశంసించారు. ఈ విజయంతో జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానాలను సాధించే సామర్థ్యం విశ్వవిద్యాలయానికి ఉందని తెలిపారు. ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ కింద రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయని ప్రస్తావించారు. డీప్ ఓషన్ మిషన్ కార్యక్రమం కింద మెరైన్ బయాలజీ విభాగానికి రూ.4.12 కోట్ల గ్రాంట్ లభించడం విశ్వవిద్యాలయ అభివృద్ధికి కొత్త అవకాశాలను కల్పించిందని వివరించారు. ఈ నిధుల ద్వారా పరిశోధన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ విద్య, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి మరింత ఊతమిస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయం చేపడుతున్న జాతీయ సేవా పథకం కార్యక్రమాలు, గ్రామీణాభివృద్ధి, కమ్యూనిటీ డెవలప్‌మెంట్, కాలేజ్‌- టు - విలేజ్, ల్యాబ్ - టు - ల్యాండ్ వంటి కార్యక్రమాలను అభినందిస్తున్నానని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. విద్యార్థులు తమ వృత్తి జీవితంలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. కరుణ, నిజాయితీ, వినయం, పరస్పర గౌరవం వంటి విలువలను జీవితాంతం పాటించాలని సూచించారు. ఏపీజే అబ్దుల్ కలాం సందేశాన్ని గుర్తుచేస్తూ ప్రపంచానికి మీ అత్యుత్తమ కృషిని అందించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. అప్పుడు ప్రపంచం కూడా మీకు అత్యుత్తమ అవకాశాలు, గుర్తింపు, విజయాలను తిరిగి అందిస్తోందని తెలిపారు. యువత పెద్ద కలలు కనాలని, పట్టుదలతో కృషి చేస్తే ఏ లక్ష్యమైనా సాధించగలరని చెప్పుకొచ్చారు. విద్యే సమాజ మార్పునకు అత్యంత శక్తివంతమైన ఆయుధమని ఉద్ఘాటించారు. విద్యా రంగం, పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించే వర్క్‌షాప్‌లు, సెమినార్లు, సదస్సులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. తమ జ్ఞానం, నైపుణ్యాలను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించి దేశ అభివృద్ధికి తోడ్పడాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు.

-------

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 10 జూన్ 2026

# ఈశ్వరుడి సాక్షిగా..

## అభివృద్ధి పేరుతో కోట్లు అక్రమ వసూళ్ల స్వాహా..!

**అధికార పార్టీ కి సన్నిహితంగా ఉన్నాననే నేపంతో అడ్డగోలు వసూళ్లు.!**

**దేవుడి పేరిట దాతలను, భక్తులను బురిడీ కొట్టించిన ఆలయ వసూల్ రాజా.**

**కోట్లాది రూపాయల విరాళాలు సొంత జేబుల్లోకి.**

**ఆలయంలో తూతూ మంత్రంగానే అభివృద్ధి.**

**దేవాలయ కమిటీ సభ్యులు శివ భక్తులు ఆగ్రహం.**

**తక్షణమే సమగ్ర విచారణ జరిపించి దోసులను కఠినంగా శిక్షించాలని భక్తుల డిమాండ్.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 09:**
దేవుడి పేరిట దోపిడీ.. శివయ్య సన్నిధిలో అడ్డగోలు వసూళ్లు భక్తిని అడ్డం పెట్టుకుని కోట్ల రూపాయలు స్వాహా చేసిన ఒక 'వసూల్ రాజా' భాగోతం ఇప్పుడు నంద్యాల జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. జిల్లాలోనే నవనందులలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నంద్యాల పట్టణంలోని చామకాలువకు దగ్గరగా ఉన్న ఒకఆలయ అభివృద్ధి పేరిట ఈ మెగా స్కామ్ సాగింది. నంద్యాల జిల్లాలోనే అత్యంత పవిత్రమైన క్షేత్రం ప్రథమ నందీశ్వర స్వామి ఆలయం. ఆ శివయ్యను దర్శించుకుంటే పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. కానీ, అదే నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని ఒక కిలాడీ బాబు కోట్ల రూపాయల దందాకు తెరలేపాడు. ఆలయ పదవిని అడ్డం పెట్టుకుని దేవుడి క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామంటూ పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లకు తెర లేపారు.
నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రముఖ వైద్యులు, వ్యాపారవేత్తలు, పట్టణ ప్రముఖులు, మరియు భక్తులను టార్గెట్ చేశాడు ఈ వసూల్ రాజా. "ఆలయ ఆవరణంలో భక్తులకొరకు గదులు అద్భుతంగా తీర్చిదిద్దుతాం దాతలుగా ముందుకు రండి" అంటూ నమ్మబలికాడు. శివయ్యపై భక్తితో ఆయా ప్రముఖులు, డాక్టర్లు, వ్యాపారస్తులు అడిగినంత కానుకలు, విరాళాల రూపంలో కోట్ల రూపాయలు కుమ్మరించారు.
కోట్లు వసూలు చేయడం అయితే అయిపోయింది మరి ఆలయ అభివృద్ధి ఎక్కడ అంటే సమాధానం లేదు! అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉండటంతో, తాను ఏం చేసినా అడిగేవారు లేరనే ధీమాతో ఈ వసూల్ రాజా రెచ్చిపోయినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మైకుల ముందు, ప్రచారాల్లో మాత్రం "ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం" అంటూ ఆర్భాటాలు, బహిరంగ ప్రకటనలు గుప్పించారు. తీరా చూస్తే క్షేత్రస్థాయిలో ఆశ్చర్యపోయే విషయాలు వెలుగులోకి రావడంతో పాటు, శివయ్య సన్నిధిలో తూతూ మంత్రంగానే అభివృద్ధి జరిగినట్లు ప్రజల చర్చించుకుంటున్నారు. దాతలు ఇచ్చిన కోట్లాది రూపాయలు నేరుగా వసూల్ రాజా సొంత జేబుల్లోకి, సొంత వ్యాపారాల్లోకి వెళ్ళిపోయాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వసూలు చేసిన కోట్లాది రూపాయలకు లెక్కలు లేవు. దేవుడి సొమ్మును నొక్కేసిన ఈ వసూల్ రాజా వ్యవహారంపై ఇప్పుడు శివభక్తులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల భావోద్వేగాలతో, నమ్మకాలతో, విశ్వాసాలతో ఆటలాడుకుంటూ, పట్టణ ప్రముఖులను మోసం చేసిన ఆ వసూల్ రాజా పై తక్షణమే సమగ్ర విచారణ జరపాలని భక్తులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై దేవాదాయ శాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కొందరు వ్యక్తులు అధికార బలం చూసుకుని దేవుడి సొమ్ముకే ఎసరు పెట్టాడు ఆ వసూల్ రాజా మరి ఈ కోట్లాది రూపాయల వసూళ్లు ఎవరి జోబులోకి వెళ్లాయో ఇప్పుడు తేలాల్సి ఉంది. ఈ అక్రమ వసూళ్లక భాగోతంపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో, ఆ వసూల్ రాజా వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరో పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపడితే ఆ సూత్రధారుల భాగవతాలు కూడా బయటపడతాయని ప్రజలు శివ భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

## కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా హామీలు నెరవేర్చలేదు.

**- ప్రజలకు, రైతులకు, నిరుద్యోగులకు చంద్రబాబు ప్రభుత్వం వెన్నుపోటు పొడిచింది.-సద్దల సూర్యనారాయణ రెడ్డి.**

**- నాడు సొంత మామకు.. నేడు ప్రజలకు వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు అలవాటే.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 09:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నంద్యాలలో వైఎస్సార్సీపీ శ్రేణులు నిరసన బాట పట్టాయి. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు.. 'వెన్నుపోటుకు రెండేళ్లు' పేరిట స్థానిక వైఎస్సార్సీపీ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో, అసెంబ్లీ పరిశీలకుడు సద్దల సూర్యనారాయణ రెడ్డి సమక్షంలో పార్టీ నేతలు నల్ల బెలూన్లను గాల్లోకి ఎగురవేసి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని నేతలు పరిశీలించారు. ఈ నిరసన కార్యక్రమంలో కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని చంద్రబాబు నాయుడు నెరవేర్చలేదని మండిపడ్డారు. నాడు సొంత మామకే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు నేడు ప్రజలకు,



నిరుద్యోగులకు, మహిళలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. రాష్ట్రంలో కనీసం యూరియా, ఎరువులు కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందని, గిట్టుబాటు ధరలు లేక రైతులు నట్టేట మునిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతులను, ప్రజలను ఆదుకోకపోతే ప్రభుత్వాలు కూలిపోవడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ విజయశేఖర్ రెడ్డి, రాష్ట్ర ఎస్టీసెల్ సెక్రటరీ శంకర్నాయక్ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, జిల్లా అధికార ప్రతినిధి అనీల్ అమృతరాజ్, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివయ్య, మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, నంద్యాల అసెంబ్లీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు వివేకానంద రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, నంద్యాల జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టీవి రమణ, వైసీపీ నేతల బొల్లెద్దుల రవికుమార్, నంద్యాల వైసీపీ సెక్రటరీలు శివనాగిరెడ్డి, దేవనగర్ బాష, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు కారురవికుమార్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిరుపతి, మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఆటోనగర్ బాధిత కార్మికులకు అండగా

# మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి.!

**మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి కి తాలూకా సీఐ మధ్య వాగ్వివాదం. -బాధితుల కోసం రోడ్డుపై బైఠాయించిన భూమా.**

**నలుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు. -కేసు నమోదు చేయడంతో ధర్నా విరమించిన భూమా.**

**బాధితులకు న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటా. -నాడు భూమా నాగిరెడ్డి..నేడు భూమా బ్రహ్మానందరెడ్డి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 09:**
నంద్యాల పట్టణంలో కొన్నేళ్లుగా ఆటో నగర్ స్థలాలపై రెండు వర్గాల మధ్య సమస్య మొదలైంది. ఆటో నగర్లో దాదాపు 30 మంది వద్ద అప్పటి అసోసియేషన్ నాయకులు, ఇద్దరు వైసిపి మాజీ కౌన్సిలర్స్ వారివద్ద డబ్బులు తీసుకొని ఏళ్ళు గడుస్తున్నా స్థలాలు చూపించకపోవడంతో సమస్య మొదలైంది. ఓ వర్గం కు నేతలు, అధికారుల అండ ఉండడంతో మరో వర్గం న్యాయం కోసం మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి నీ ఆశ్రయించారు. వారి సమస్య విన్న భూమా న్యాయం ఉండడంతో వారికి మద్దతు తెలిపోయారు. ఓ వర్గానికి మద్దతు ఇవ్వడంతో రాజకీయంగా తెలుగుదేశం పార్టీలో విమర్శలు మొదలయ్యాయి. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్ దృష్టికి భూమా తీసుకొని వెళ్ళారు. కలెక్టర్ స్పందించి ఆటో నగర్ పై విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశాలు ఇచ్చినా క్రింది స్థాయి అధికారులు స్పందించకపోవడంతో మరో సారి భూమా ను కలిశారు. గతంలో అన్యాయం జరిగిన బాధితుల పక్షాన భూమా నాగిరెడ్డి నిలబడేవారు. ప్రస్తుతం బాబాయికి తగ్గట్టుగా అబ్బాయి భూమా బ్రహ్మానందరెడ్డి అదే కోవాలో కార్యకర్తల కోసం ఎంతదూరమైనా వెళ్తారు. ఈ నేపథ్యంలోనే
నంద్యాల ఆటోనగర్‌లో జరిగిన అక్రమాలపై గత కొంతకాలంగా బాధిత కార్మికుల తరఫున పోరాటం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి మరోసారి వారి సమస్యల పరిష్కారం కోసం ముందుకు వచ్చారు.
ఆటోనగర్‌లో జరిగిన అక్రమాలపై ఇప్పటికే జిల్లా కలెక్టర్,






జిల్లా ఎస్పీకి ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేకపోవడంతో బాధిత కార్మికులు మరోసారి భూమా బ్రహ్మానందరెడ్డిని కలిసి తమ గోడును వినిపించారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన కార్మికులతో కలిసి నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బాధితుల ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేయాలని కోరారు.
ఈ సందర్భంగా స్టేషన్ సీఐ వ్యవహరించిన తీరు అభ్యంతరకరంగా ఉందని భూమా బ్రహ్మానందరెడ్డి ఆరోపించారు. ప్రజాప్రతినిధిగా, బాధితుల తరఫున న్యాయం కోరుతూ వెళ్లిన తనతో సీఐ అమర్యాదకరంగా ప్రవర్తించారని ఆయన పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదును స్వీకరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ భూమా బ్రహ్మానందరెడ్డి బాధిత కార్మికులతో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు.
బాధితుల ఫిర్యాదును నమోదు చేసి, న్యాయమైన విచారణ చేపట్టే వరకు తాను వెనక్కి తగ్గబోనని ఆయన స్పష్టం చేశారు. పైస్థాయి అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సీఐ ప్రవర్తనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఆటోనగర్ బాధితుల ఫిర్యాదుపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూమా బ్రహ్మానందరెడ్డి చేపట్టిన ధర్నాకు స్పందించిన అధికారులు ఘటనపై దృష్టి సారించి బాధితుల ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేశారు. అనంతరం బాధితులకు న్యాయం జరిగేలా సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను వెలికితీసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో భూమా బ్రహ్మానందరెడ్డి తన ధర్నాను విరమించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాధిత కార్మికులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేంత వరకు వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తానని భూమా బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆటోనగర్ బాధిత కార్మికులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్హెచ్ 340 సి రహదారి విస్తరణ పనులను.. ఆగస్టు నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టండి.

**-కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**






**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 09:** ఎన్హెచ్ 340 సి రహదారి విస్తరణ పనులను ఆగస్టు నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్హెచ్ 340 సి లో భాగంగా నంద్యాల చెక్ పోస్ట్ నుండి నందికొట్కూరు రోడ్డు వరకు చేపడుతున్న పనుల పురోగతి పై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల చెక్ పోస్ట్ నుండి నందికొట్కూరు రోడ్డు వరకు చేపడుతున్న మొత్తం 9 కిలోమీటర్ల రహదారి విస్తరణ ప్రాజెక్టులో ఇప్పటివరకు సుమారు 7.5 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, మిగిలిన 1.5 కిలోమీటర్లలో జరుగుతున్న పనులలో పురోగతి తీసుకొని రావాలన్నారు.
మిగిలిన 1.5 కిలోమీటర్ల భాగంలో సుమారు కిలోమీటర్ మేర పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయని అధికారులు కలెక్టర్ కు వివరించారు. మిగిలిన 500 మీటర్ల విభాగంలో కూడా కేవలం 300 మీటర్ల మేర మాత్రమే సమస్యాత్మక ప్రాంతం ఉందని, ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఆలయ ప్రాంతం వద్ద ఆలయం కారణంగా పనులలో కొంత ఆలస్యం జరుగుతోందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా, స్థానిక ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, పరస్పర అవగాహనతో సమస్యను పరిష్కరించి ప్రాజెక్టును పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పూర్తికావడంతో ప్రాంతీయ రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ వసతులు అందుబాటులోకి రానున్నాయన్నారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, నేషనల్ హైవే, కర్నూలు ఈఈ విజయభాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నెల లోపు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాలతో నెట్ జీరో హెల్తీ క్యాంపస్ లను ఏర్పాటు చేయాలి.

**..కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు , జూన్ 09:** స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల సాధనలో భాగంగా జిల్లాలో నెట్ జీరో హెల్తీ క్యాంపస్‌ల ఏర్పాటు ఈ నెల లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల అమలుకు , నెట్ జీరో, హెల్తీ క్యాంపస్ సంబంధిత అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అల్ట్రా హెడెన్సిటీ మొక్కలు పెంచటానికి అనుకూలంగా ఉన్న 13 విద్యా సంస్థల్లో ఈనెల 19వ తారీకు లోపు మరియు ఈ నెలాఖరులోగా జిల్లాలోని మిగిలిన 37 విద్యాసంస్థలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, సంక్షేమ హాస్టళ్లు పర్యావరణ హిత కేంద్రాలుగా రూపుదిద్దుకోవడానికి అన్ని చర్యలు పూర్తి చేయటానికి వెంటనే తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నెట్ జీరో ఎనర్జీ లక్ష్యంతో నెడ్‌క్యాప్ ద్వారా సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటుకు చర్యలు జరుగుచున్నవని పేర్కొన్నారు. రక రకాల మొక్కలతో జీవ వైవిధ్యాన్ని పెంపొందించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో స్థలం అందుబాటులో ఉన్న మేరకు పనులు ప్రారంభించాలని, ట్రైబల్ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్ తదితర శాఖలకు చెందిన విద్యాసంస్థల్లో వారి అవసరాలకు అనుగుణంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నెట్ జీరో కార్యక్రమాల్లో భాగంగా బయో వేస్ట్, లిక్విడ్ వేస్ట్, గ్రీన్ వాటర్ నిర్వహణలో భాగంగా సోక్ పిట్లు, రైన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్లు, గ్రే వాటర్ పిట్ లు , కిచెన్ వేస్ట్ పిట్ లను నెల ఆఖరులోగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ పనులను ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల ద్వారా రూరల్ లో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కర్నూలు, ఆదోని, యెమ్మిగనూరు ల లో మున్సిపల్ శాఖ ద్వారా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.
ఈ సమావేశంలో " కన్హా హార్ట్ ఫుల్ నెస్ సంస్థ మరియు రాష్ట్ర ప్రభుత్వం మధ్య నెట్ జీరో పర్యవేక్షణ కొరకు కుదిరిన ఒప్పంద పత్రాన్ని సంస్థ ప్రతినిధులు కళ్యాణ్ , వెంకటరెడ్డి , గంగాధర్ జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ఈ సమావేశానికి డ్వామా పీడీ నర్సింహారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక , బీసీ వెల్ఫేర్ ప్రసూన , ట్రైబల్ వెల్ఫేర్ సురేష్ ,ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ , కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేష్ , సిపిఓ భారతి , పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి , అడిషనల్ కమిషనర్ కృష్ణ , డిపిఓ భాస్కర్ , ఎస్ ఎస్ ఎ ఏపీసి లోకరాజు , నెట్ జీరో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కళ్యాణ్ సెంటర్ కోఆర్డినేటర్ లు రామచంద్ర మిషన్ వెంకట్ రెడ్డి , గంగాధర్ , సంబందించిన అధికారులు , ఏపీఆర్జేసీ కోఆర్డినేటర్, పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలి.

**..నిరసనగా నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం. -సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి సుంకయ్య.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 09:**
కేంద్ర ప్రభుత్వం సామాన్యుడి నడ్డి విరిచేలా పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పీ సుంకయ్య డిమాండ్ చేశారు.
స్థానిక గుత్తి రోడ్డు లో సిపిఐ పట్టణ కార్యదర్శి మోట రాముడు అధ్యక్షతన రాస్తారోకో నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 12 సంవత్సరాల కాలంలో పేద, సామాన్యుల నడ్డి విరిచేలా ధరలు పెంచుతున్నారని ఆరోపించారు చాయ్ వాలా అని చెప్పుకుంటున్న ప్రధానమంత్రి ధరలను ఎందుకు అదుపు చేయలేకపోతున్నారో సమాధానం చెప్పాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పాలన వల్ల దేశంలో ప్రజాస్వామ్యమే ప్రశ్నార్థకంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజలను అశాంతి కి గురి చేస్తున్నారని ఈ విధానాలు మానుకొని పేద మధ్యతరగతి ప్రజలకు అనుకూలమైన రీతిలో ధరలు నియంత్రికరణ చేయాలని సామాన్య ప్రజల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని అన్నారు రోజు రోజు కు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వాటిని కట్టడి చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి విఫలమైందని తెలిపారు. చమురు కంపెనీలతో మాట్లాడి పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలను తగ్గించాలని లేనిపక్షంలో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు ఎన్ కె రామమోహన్, ఎస్ పులి శేఖర్, జి అబ్బాస్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాదవ్, చేతి వృత్తిదారుల జిల్లా కార్యదర్శి ఎం రామ్మోహన్ ఏపీ మహిళా సమాఖ్య నాయకురాళ్లు ఎస్ జులేఖ, ఎస్ హసీనా,ఏఐటీయూసీ డోన్ కార్యదర్శి ఎం పుల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ అన్వర్ కోశాధికారి సుధాకర్ నాయుడు, ఆటో యూనియన్ డోన్ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, ఏఐవైఎఫ్ డోన్ మండల, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు హరికృష్ణ, రజాక్, పార్టీ శాఖ కార్య దర్శులు పాపారాయుడు, బాల మద్దయ్య, కొండయ్య, రంగస్వామి, వై శేఖర్ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్ హెచ్ 40 బ్రిడ్జి కింద సర్వీస్ రోడ్డు నిర్మాణం.

**బ్లాక్ స్పాట్ తప్పించి సురక్షితమైన ప్రయాణంనకు మార్గం సుగమం.**

**..నిరంతరం పనిచేయు సీసీటీవీ కెమెరాలు, సోలార్ లైట్ల ఏర్పాటు.**

**..పరిసర ప్రాంతాల ప్రజలు, రైతుల హర్షం.**





**ఆంధ్ర ప్రగతి పాణ్యం జూన్ 09:**
కర్నూలు రేంజ్ డీఐజీ శ్రీ కోయ ప్రవీణ్, సూచనల మేరకు, నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్, మరియు నంద్యాల జిల్లా సబ్ డివిజనల్ అధికారిణి కుమారి ఎం . జావళి ఆల్ ఫోన్స్, ల ప్రత్యక్ష పర్యవేక్షణలో పాణ్యం పోలీసులు ప్రజా రక్షణ కోసం ఒక ప్రశంసనీయమైన ముందడుగు వేశారు.

పాణ్యం మండలం సుగాలి మెట్ట గ్రామం నుండి పిన్నపురం గ్రామానికి వెళ్ళడానికి ప్రజలు జాతీయ రహదారి కి ఎదురుగా (ఆపోజిట్ లో) వెళ్ళవలసి వచ్చేది. ఈ క్రమంలో అక్కడ గత కొంతకాలంగా విపరీతంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతూ, ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారింది. ఈ ప్రమాదకరమైన బ్లాక్ స్పాట్ యొక్క పరిస్థితిని గమనించిన పాణ్యం సర్కిల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, పాణ్యం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తక్షణమే స్పందించారు.

ప్రమాదాలను పూర్తిగా నివారించడమే లక్ష్యంగా, సుగాలిమెట్ట నుండి ఎన్ హెచ్ 40 రోడ్డు బ్రిడ్జి కింద గుండా వెళ్లేలా, నేషనల్ హైవే, రెవెన్యూ, ఎలక్ట్రికల్,అధికారులు మరియు పబ్లిక్ సహాయ సహకారంతో ఒక సురక్షితమైన సర్వీస్ రోడ్డును వేయించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత , నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ , నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి కుమారి ఎం. జావళి, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్.యుగంధర్ బాబు సంబంధిత అధికారులు హాజరై నూతనంగా నిర్మించిన రోడ్డును అండర్ పాస్ బ్రిడ్జిను ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి మరియు డిజిపి ఆదేశాలమేరకు నంద్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి ఉంచిందని,రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా సువాలిమెట్ట మరియు పిన్నాపురం గ్రామ ప్రజల సౌకర్యార్థం ఒక నూతన అండర్ పాస్ ను, ప్రత్యేక రోడ్డును అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. రోడ్డు ప్రమాదం అనేది జరిగితే అందులో రెండు వైపులా ఉన్నవారూ బాధితులే అవుతారని, ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

బ్లాక్ స్పాట్ నివారణ కొరకు ఇంతకుముందు ప్రజలు యూటర్న్ తీసుకోవడానికి సుమారు 5.5 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వచ్చేది.ఎక్కువ దూరం ప్రయాణించలేక వాహనదారులు షార్ట్‌కట్ కోసం రాంగ్ రూట్ (తప్పుడు వైపు) లో ప్రయాణించడం వల్లే ఇక్కడ ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుండేవి. ఇలాంటి ప్రమాదాలను అరికట్టేందుకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు

**ప్రజలకు విజ్ఞప్తి:**
ఈ ఐదు కిలోమీటర్ల పరిధిలో వాహనదారులు ఎవరూ కూడా ప్రాణాలకు ముప్పు తెచ్చే విధంగా 'రాంగ్ సైడ్ డ్రైవింగ్' (తప్పుడు వైపు ప్రయాణం) చేయవద్దని, కొత్తగా ఏర్పాటు చేసిన అండర్ పాస్‌ను ఉపయోగించుకుని సురక్షితంగా ప్రయాణించాలని పోలీస్ శాఖ ప్రజలను కోరుతోంది. ఒక్క ప్రమాదాన్ని నివారించగలిగినా అది ఒక కుటుంబానికి పెద్ద ప్రాణభిక్ష అవుతుందని ఈ సందర్భంగా అధికారులు గుర్తుచేశారు.ఈ అండర్ పాస్ నిర్మాణానికి సహకరించిన రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది, నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు రెండు గ్రామాల ప్రజలకు జిల్లా పోలీస్ అధికారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**ఈ రోడ్డు వలన ప్రజలకు కలిగే ప్రయోజనాలు**
జాతీయ రహదారిపై ఎదురెదురుగా వెళ్లి ప్రమాదంలకు గురికావడము నిరోదించడము వల్ల రోడ్డు ప్రమాదాలు పూర్తిగా నివారించబడతాయి.

ప్రజలకు ఈ నూతన సర్వీస్ రోడ్డు ద్వారా ప్రయాణ దూరం దాదాపు 5.5 కిలోమీటర్ల మేర తగ్గడంతో పాటు సమయం,ఇంధనం కూడా ఆదా అవుతాయి.

పొలాలకు వెళ్లే రైతులతో పాటు, మూగజీవాలు (పశువులు) కూడా ఎటువంటి ప్రమాదం లేకుండా సురక్షితంగా రోడ్డు దాటడానికి ఈ మార్గం ఎంతో అనుకూలంగా మారింది. ఈ మార్గంనకు ఇరువైపులా సోలార్ లైట్లు ఏర్పాటు చేయడం వలన రాత్రి ప్రమాదాలను నివారించడమే కాకుండా నిరంతరం పనిచేయు సీసీటీవీ కెమెరాలను అమర్చడం వలన నేరాలు జరగకుండా నివారించవచ్చు.

**సులభతరమైన ప్రయాణం**
సుగాలిమెట్ట మరియు చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఎటువంటి ప్రమాదములు జరగకుండా సునాయాసంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. ప్రజల ప్రాణ రక్షణే ధ్యేయంగా, ప్రమాదాల నివారణకు యుద్ధప్రాతిపదికన ఈ సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేసిన పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి మరియు సిబ్బందిని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ మరియు జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ప్రత్యేకంగా అభినందించారు. పోలీసుల తీసుకున్న ఈ నిర్ణయం పట్ల స్థానిక ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## మిడెన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ క్యాంపస్ నియామక డ్రైవ్‌లో 14 మంది విద్యార్థుల ఎంపిక.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 09:**
శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), నంద్యాల వారి ఆధ్వర్యంలో మిడెన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను విజయవంతంగా నిర్వహించింది.

ఈ నియామక కార్యక్రమానికి కళాశాల చైర్మన్ డా. జి. రామకృష్ణ రెడ్డి, డైరెక్టర్ డా. జి. హేమంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ కె.బి.వి. సుబ్బయ్య, విభాగాధిపతి డా. యు.వి.ఎస్. కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు కె. సంపత్ మరియు ఎస్. ఇంతియాజ్ అహమ్మద్ పర్యవేక్షణ అందించారు. కంపెనీ తరపున మామిళ్ల సుభాష్ (జనరల్ మేనేజర్), యదు బాలకృష్ణన్ (అసిస్టెంట్ మేనేజర్), మనోహర్ రెడ్డి (అసోసియేట్ మేనేజర్) మరియు థిమేష్ (టీమ్ లీడ్) పాల్గొని నియామక ప్రక్రియను నిర్వహించారు.ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో డిగ్రీ మరియు పీజీ కోర్సులకు చెందిన మొత్తం 95 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా ఫేస్-టు-ఫేస్ ఇంటర్వ్యూ మరియు హెచ్‌ఆర్ రౌండ్ అనే రెండు దశలను నిర్వహించారు. మొదటి దశలో జరిగిన ఫేస్-టు-ఫేస్ ఇంటర్వ్యూలో 45 మంది విద్యార్థులు అర్హత సాధించి హెచ్‌ఆర్ రౌండ్‌కు ఎంపికయ్యారు. అనంతరం జరిగిన హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలలో ప్రతిభ కనబరిచిన 14 మంది విద్యార్థులు మిడెన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కు ఎంపిక అయ్యారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా. జి. రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించేలా కళాశాల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. డైరెక్టర్ డా. జి. హేమంత్ రెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించారు.ప్రిన్సిపాల్ కె.బి.వి. సుబ్బయ్య, విభాగాధిపతి డా. యు.వి.ఎస్. కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు కె. సంపత్ మరియు ఎస్. ఇంతియాజ్ అహమ్మద్‌లు ఎంపికైన విద్యార్థులను అభినందించి, ఈ అవకాశాన్ని కల్పించిన మిడెన్ ల్యాబ్స్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి.

**పోలీసు శాఖ గౌరవాన్ని మరింత పెంచాలి - ఎస్ఐ స్థాయి నుండి సిఐలుగా పదోన్నతి .**

**ఎస్ఐ నుండి సిఐలుగా పదోన్నతి పొందిన పోలీసు అధికారులను అభినందించినడీఐజీ కోయ ప్రవీణ్.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు జిల్లా క్రైమ్ జూన్ 09:**కర్నూలు రేంజ్ పరిధిలో ఇటీవల సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) నుండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా పదోన్నతి పొందిన పోలీసు అధికారులు మంగళ వారం కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పదోన్నతి పొందిన పోలీసు అధికారులను డీఐజీ అభినందించారు. పదోన్నతితో మరింత బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు.ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, చట్టబద్ధంగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో మరింత చొరవ చూపాలని తెలిపారు. పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావడంతో పాటు ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలని సూచించారు.
సీఐలుగా పదోన్నతి పొంది డీఐజీ ని కలిసిన వారిలో ఎ.పి. శ్రీనివాసులు, జీవన్ రెడ్డి , ముత్యాల శ్రీనివాసులు, ధనుంజయ,తిమ్మయ్య,లక్ష్మీనారాయణ,హనుమంతయ్య, లలిత ఉన్నారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన అధికారులు కర్నూలు రేంజ్ డీఐజీ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## వ్యవసాయ మార్కెట్ దుకాణాల వేలం పాటలకు భారీ స్పందన.

**..10 దుకాణాలకు 3 లక్షల 26 వేల 800 ఆదాయం. -.గోడౌన్ కు 85 వేలు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 09:**
నంద్యాల వ్యవసాయ మార్కెట్ దుకాణాల వేలం పాటలకు భారీ స్పందన లభించింది.10 దుకాణాలకు వేలం పాటలు పోటా పోటీగా సాగాయి.10 దుకాణాలకు గతంలో 26 వేలు వచ్చేది.గోడౌన్ కు గతంలో 32 వేలు వచ్చేది.ప్రస్తుతం వేలం పాటల్లో 10 దుకాణాలకు వేలం పాటల్లో 3 లక్షల 26 వేల 800 పాడుకున్నారు.అలాగే గోడౌన్ 85 వేలకు పాడుకున్నారు.గత 16 ఏళ్లుగా ఆ దుకాణాల్లో ఉన్న వారు తక్కువ ధరకు ఉండడంతో బాడుగ పెంచకుండా ఖాళీ చేయకుండా ఉండడంతో వ్యవసాయ కమిటీ కోర్టును ఆశ్రయించారు.కోర్టు వ్యవసాయ కమిటీ కె అనుకూలంగా తీర్పు వెలువరించారని మార్కెట్ యార్డ్ చైర్మెన్ గుంటుపల్లి హరి బాబు మీడియా తో పేర్కొన్నారు.ఈ నేపథ్యంలోనే వేలం పాటలు నిర్వహిస్తున్నామని ప్రకటించడంతో దాదాపు 100 మంది వేలం పాటల్లో పాల్గొన్నారు.సర్కార్ సవాల్ 5300 తో 1 నంబర్ దుకాణం నుంచి వేలం పాటలు మొదలు పెట్టారు.వేలం పాటలు కనివిని ఎరుగని రీతిలో ఎవరు ఊహించ నీ విధంగా వేలం పాటలు మొదలయ్యాయి.వేలం పాటల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు మధ్య వేలం పాటలు నిర్వహించారు.వేలం పాటల్లో 1 నంబర్ దుకాణం షేక్ ఇమ్రాన్ ఖాన్ 32,600 కు పడుకున్నారు.2 వ దుకాణం అజ్మీర్ 2700,3 వ దుకాణం సురేంద్ర 23,800.4 వ దుకాణం మాభూ భాష 23,800.5 వ దుకాణం చాంద్ బాషా 27,700.6 వ దుకాణం హర్షి అనే మహిళ 30,100.7 వ దుకాణం చాంద్ బాషా 35,500.8 వ దుకాణం నూర్ భాష 34,500.9 వ దుకాణం షేక్ సమ్మద్ భాష 42,000.10 వ దుకాణం భూషణ్ రెడ్డి 51 వేలకు పాడుకున్నారు.గోడౌన్ ను భూషణ్ రెడ్డి 85 వేలకు పాడుకున్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వేలం పాటల్లో పాడుకున్న వారు దుకాణం బాడుగతో పాటు 18 శాతం జీఎస్టీ చెల్లించాలన్నారు.దుకాణం మూడేళ్ల పరిమితి ఉంటుందని ప్రతి ఏటా బాడుగపై 5 శాతం పెంచి ఇవ్వాలన్నారు.ప్రతి దుకాణం దారుడు బాడుగ ప్రతి నెల 5 వ తేదీ లోపు చెల్లించాలన్నారు.వేలం పాటలో దుకాణం దక్కించుకున్నారు వారు పాడిన పాట మొత్తాన్ని రెండు నెలల అడ్వాన్సుగా ఇవ్వాలన్నారు.ప్రస్తుతం ఆ దుకాణాల్లో ఉన్నవారిని 10 రోజుల్లోపు ఖాళీ చేయించిన తర్వాతనే ,దుకాణంలో చేరినప్పటినుంచి బాడుగ ఇవ్వాల్సివస్తుందని పేర్కొన్నారు.10 దుకాణాలకు,ఒక గోడౌన్ పై ఈ రోజు జరిగిన వేలం పాటల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీకి 4 లక్షల 11 వేల 800 ప్రతి నెల వస్తుందన్నారు.వ్యవసాయ మార్కెట్ కమిటీకి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు,పేరు న ధన్యవాదాలు తెలిపారు.మార్కెట్ యార్డ్ చైర్మెన్ గుంటుపల్లి హరిబాబు,కమిటీ సభ్యులు,అధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జూన్ 09:**
మంగళవారంనాడు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేతలు కవిత, మరియు విష్ణు వ్యవసాయ సహాయ సంచాలకులు చెన్నయ్య మరియు మండల వ్యవసాయ అధికారి నంద్యాల ప్రసాద రావు ఆధ్వర్యంలో లో కేత్ బచావో అభియాన్ (భూ ఆరోగ్య సంరక్షణ ) కార్యక్రమాన్ని పోలూరు గ్రామంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు కవిత మరియు విష్ణు మాట్లాడుతూ.. రైతులకి భూమి ఆరోగ్యం నీటి సంరక్షణ సేంద్రియ వ్యవసాయం పంటల వైవిధ్యకరణ మరియు వ్యవసాయ ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించారు.అదే విధంగా సహాయ వ్యవసాయ సంచాలకులు చెన్నయ్య మాట్లాడుతూ రైతులు భూసారా పరీక్షలకు అనుగుణగా ఎరువులు వాడుకోవాలని భూముల క్షీణత నుంచి కాపాడుకోవాలని రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు, మరియు పచ్చి రొట్ట ఎరువులను, జీవన ఎరువులను వాడుకొని నేల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని సూచించారు.మండల వ్యవసాయ అధికారి నంద్యాల వారు ప్రసాద్ రావు మాట్లాడుతూ.. రైతులు పంటలకు ఎరువులను అవసరం మేరకే ఉపయోగించాలని ముఖ్యంగా యూరియా మరియు డి.ఏ.పీ ఎరువులను మోతాదుకు మించి వాడరాదని తెలియజేశారు. అధిక ఎరువుల వాడకం వలన భూసారం కోల్పోయి పంట దిగుబడులపై ప్రభావం చూపుతుందని తెలిపారు. సమతుల ఎరువుల వాడకం ప్రోత్సహించడానికి ఈ ఖరీఫ్ సీజన్ నుండి యూరియా మరియు డి.ఏ.పీ ఎరువులను ఏపీ ఏఐఎంఎస్ ద్వారా పంపిణి చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ ఆప్ నందు గత ఖరీఫ్ కాలంలో సాగు చేసిన పంటల వివరాలు రైతు వారిగా పొందుపరచడం జరిగిందని, అలాగే మండలం లోని ఎరువుల డీలర్లను అనుసందానించడం జరిగిందని, ఏ పంటకు ఎంత మోతాదులో నత్రజని, భాస్వరం వాడాలో దానికి అనుగుణంగా ఎన్ని బస్తాల యూరియా మరియు డి.ఏ.పీ అవసరమో సూచించడం జరిగిందని తెలిపారు. రాబోవు ఖరీఫ్ కాలం నుండి రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ ఎరువుల డీలర్లు మరియు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల యందు పైన తెలిపిన ఆప్ ద్వారా యూరియా మరియు డి.ఏ.పీ ఎరువులు పంపిణి చేయబడునని తెలియజేశారు. ఆప్ ద్వారా ఎరువుల పంపిణీ విధానం గురించి మండలంలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇంకా ఆప్ గురించి పూర్తి సమాచారం కొరకు సమీప రైతు సేవా కేంద్రంను సందర్శించగలరని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పల్లవి మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## జిల్లాలో 50 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన లక్ష్యం.

**..56 పాఠశాలల్లో 'అనంత అరణ్య' ప్లాంటేషన్ కార్యక్రమం.**

**..జలధార - జలహారతి పనులు వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలి.**

**..హార్టికల్చర్ విస్తరణతోనే రైతుల ఆదాయం, జిల్లా జీడీపీ పెరుగుతుంది : కలెక్టర్ రాజకుమారి.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 09:**
జిల్లా ఆర్థికాభివృద్ధి, రైతుల ఆదాయాల పెంపు లక్ష్యంగా హార్టికల్చర్ విస్తరణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా జిల్లా జీడీపీని గణనీయంగా పెంచేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో కార్యాచరణను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎంపీడీఓలు, ఉపాధి హామీ, జలవనరులు తదితర శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో హార్టికల్చర్ విస్తరణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన, అనంత అరణ్య (అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్), జలధారజలహారతి కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో అమలవుతున్న అనంత అరణ్య కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. హార్ట్‌ఫుల్‌నెస్ ఫౌండేషన్ సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎంపిక చేసిన 56 విద్యాసంస్థల్లో అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, కంపోస్ట్ పిట్స్, సోక్ పిట్స్, సోలార్ ఎనర్జీ వినియోగం వంటి కార్యక్రమాలు చేపట్టి వాటిని నెట్ జీరో హెల్తీ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.జిల్లా ఆర్థికాభివృద్ధిలో హార్టికల్చర్ కీలక పాత్ర పోషిస్తోందని... ప్రస్తుతం 49 వేల హెక్టార్లలో సాగవుతున్న ఉద్యానవన పంటలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం 49 వేల హెక్టార్లలో సాగవుతున్న హార్టికల్చర్ ద్వారా సుమారు రూ.7,500 కోట్ల ఆదాయం లభిస్తుండగా, 2.70 లక్షల హెక్టార్లలో సాగవుతున్న సంప్రదాయ వ్యవసాయం ద్వారా రూ.3,500 కోట్ల ఆదాయం మాత్రమే వస్తోందని వివరించారు. రైతుల ఆదాయాలు, జిల్లా జీడీపీ, తలసరి ఆదాయాన్ని పెంచేందుకు హార్టికల్చర్ విస్తరణపై అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. డోన్, మహానంది వంటి ప్రాంతాల్లో ఉద్యానవన పంటల ద్వారా అధిక ఆదాయాలు వస్తుండగా, వరి సాగుపై అధికంగా ఆధారపడుతున్న కొన్ని మండలాల్లో తలసరి ఆదాయం తక్కువగా ఉందని పేర్కొన్నారు. రైతులను అధిక ఆదాయం వచ్చే పంటల వైపు మళ్లించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఏడాది 5,000 ఎకరాల్లో హార్టికల్చర్ ప్లాంటేషన్ చేపట్టనున్నట్లు తెలిపారు. ఏ ప్రాంతానికి ఏ పంట అనుకూలమో గుర్తించి రైతులకు అవగాహన కల్పించాలని, లబ్ధిదారుల ఎంపిక, సాగు వివరాలను పూర్తిస్థాయిలో సేకరించాలని ఆదేశించారు.
ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో యువత, మహిళా సంఘాలు, ఆసక్తి కలిగిన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# నాడు జేబులు కొల్లగొట్టిన వ్యవస్థ...
# నేడు అదే వ్యవస్థను శాసిస్తున్న
# కలెక్టర్ గంధం చంద్రుడు..!



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 09:**
గంధం చంద్రుడు ఐఏఎస్ తన చిన్ననాటి జ్ఞాపకాలను అక్షరీకరించిన "నా సర్టిఫికెట్ కథ" కేవలం ఒక వ్యక్తిగత అనుభవం కాదు. అది ఈ దేశంలో అణగారిన వర్గాల పిల్లలు చదువు కోసం, ఒక చిన్న కాగితం ముక్క కోసం పడే ఆవేదనకు, వ్యవస్థలోని అవినీతి కోరలకు అద్దం పట్టే ఒక సజీవ సాక్ష్యం.
ఏపీ క్యాడర్ ఐఏఎస్ అధికారి గంధం చంద్రుడు గారు తన ఫేస్‌బుక్ వాల్ పై రాసుకున్న ఈ కథ చదువుతుంటే ఎవరికైనా కన్నీళ్లు ఆగవు. వ్యవస్థలోని అవినీతి ఒక చిన్నారి చదువుపై, ఒక పేద కుటుంబంపై ఎలాంటి మానసిక క్షోభను మిగులుస్తుందో ఆయన మాటల్లోనే..
.

## నా సర్టిఫికెట్ కథ : నిప్పుల దారిలో నవోదయ స్వప్నం

అది 1992వ సంవత్సరం. కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండల రెవెన్యూ కార్యాలయం తీవ్రమైన మండుటెండల మధ్యాహ్న సమయంలో ఉంది. ఆఫీసు ఎదురుగా పది మీటర్ల దూరంలో ఒకే ఒక్క తుమ్మ చెట్టు ఉంది. ఎండ తీవ్రతకు ఆ చెట్టు ఆకులు కూడా ముడుచుకుపోయి, సరిగ్గా నీడను కూడా ఇవ్వలేకపోతున్నాయి. చుట్టుపక్కల ఎటు చూసినా ఎండమావులు తప్ప మరో నీడ జాడ లేదు. ఆ చెట్టు కింద ఉన్న ఒక చిన్న నాపరాతి అరుగు మీద పదకొండేళ్ల ఒక పల్లెటూరి బాలుడు కూర్చుని ఉన్నాడు. ఆకలి దంచేస్తోంది, ఎండ నిప్పులు కురిపిస్తోంది. కానీ ఆ బాలుడి కళ్లు మాత్రం ఆఫీసు గుమ్మం వైపే చూస్తున్నాయి. ఏ నిమిషంలోనైనా లోపల నుంచి తన పేరు పిలుస్తారేమోనన్న ఆశతో ఉన్న ఆ అబ్బాయే గంధం చంద్రుడు.

## ఐదో తరగతి విజేత.. ఏడు రూపాయల ప్రయాణం

మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఒక పెద్దాయన వచ్చి ఆ అరుగు మీద కూర్చుంటూ, ఏం నాయనా ఇక్కడ కూర్చున్నావు, ఏం పని అని అడిగాడు. కులం సర్టిఫికెట్ కోసం వచ్చాను పెద్దాయన, అప్లికేషన్ పెట్టి నెల దాటింది, ఈరోజు ఇస్తామని మా ఊరి తలారి చెబితే వచ్చాను అన్నాడు చంద్రుడు. మరి మీ అమ్మనాన్నలు రాలేదా, ఒక్కడివే వచ్చావేం అని ఆయన అడగగా, వాళ్లు కూలి పనికి వెళ్లారు పెద్దాయన, నేను ఐదో తరగతి పాసయ్యాను, నవోదయ స్కూల్ ఎంట్రన్స్ రాస్తే సీట్ వచ్చింది, జాయిన్ అవ్వాలంటే సర్టిఫికెట్లు అన్నీ ఒరిజినల్స్ తీసుకురావాలని లెటర్ వచ్చింది, అందుకే ఒక్కడినే వచ్చాను అని సమాధానమిచ్చాడు.
ఆ ముందు రోజు రాత్రి ఇంట్లో జరిగిన ముచ్చట చంద్రుడి మనసులో కదలాడింది. తండ్రి కూలి పని నుంచి రాగానే, నాన్న నవోదయ స్కూల్లో చేరాలంటే సర్టిఫికెట్లు కావాలంట, నువ్వు వస్తావా అని అడిగాడు. తండ్రి నిస్సహాయంగా, నేను పనికి పోకపోతే ఇల్లు గడవదు కదరా, నువ్వే వెళ్లగలవా అన్నాడు. వెళ్తాను నాన్న, పేరుసోముల నుంచి తిమ్మనాయునిపేటకు రూపాయిన్నర, అక్కడి నుంచి కొలిమిగుండ్లకు రెండు రూపాయలు, రానుపోను ఏడు రూపాయలు అవుతుందని కొడుకు లెక్క చెప్పాడు. తండ్రి తన చెమట చుక్కల సంపాదన నుంచి ఒక పది రూపాయల నోటు తీసి చంద్రుడి చేతిలో పెడుతూ, డబ్బులు జాగ్రత్త నాయనా, మధ్యాహ్నం ఏదైనా కొనుక్కు తిను అన్నాడు. ఉదయాన్నే నిక్కరు జేబులో ఆ పది రూపాయల నోటును గుండెలా దాచుకుని, బస్సెక్కి కొలిమిగుండ్ల ఆఫీసుకు చేరుకున్నాడు చంద్రుడు. టికెట్లు పోగా జేబులో ఐదు రూపాయల నోటు, ఒకటిన్నర రూపాయి చిల్లర మిగిలాయి.

## అవినీతి రాబందుల నీడలో

ఆఫీసులో క్లర్క్‌ను అడిగితే, ఎంఆర్ఓ గారు బయటకు వెళ్లారు, వచ్చేవరకు వేచి ఉండమన్నాడు. సమయం కరుగుతోంది. ఒంటి గంట, రెండు, మూడు, నాలుగు అయింది. ఆకలి కడుపును నలిపేస్తోంది. చెప్పులు లేని కాళ్లు ఆ కాలుతున్న నాపరాతి బండపై పొక్కులుక్కుతున్నాయి. కానీ చంద్రుడు అక్కడి నుంచి కదలలేదు. ఒకవేళ తను తినడానికి బయటకు వెళ్లినప్పుడు ఎంఆర్ఓ గారు వచ్చి వెళ్లిపోతే, సర్టిఫికెట్ దొరకకపోతే నవోదయ సీటు పోతుందనే భయమే అతడిని ఆ ఎండలో నిలబెట్టింది.
ఆఫీసు బయట తెల్లబట్టలు వేసుకున్న ఒక దళారీ కుర్చీలో దర్జాగా కాలు మీద కాలేసుకుని కూర్చుని ఉన్నాడు. జనాలు ఆయన ముందు చేతులు కట్టుకుని నిలబడుతున్నారు. మధ్యాహ్నం మూడున్నర ప్రాంతంలో ఎంఆర్ఓ గారు వచ్చారు. అంతవరకు దర్జాగా కూర్చున్న ఆ తెల్లబట్టల వ్యక్తి ఒక్క ఉదుటున లేచి, నడుం వంచి వినయంగా నమస్కారం పెట్టాడు.



అధికారం ముందు మోకరిల్లే వ్యవస్థ రూపం అది.
చంద్రుడు ఆశగా మళ్లీ లోపలికి వెళ్లాడు. ఈసారి అక్కడ ఉన్న బిళ్ల బంట్రోతు అడ్డుపడ్డాడు. నీం పని అయిపోయిందిలే కానీ, ఏమన్నా తెచ్చావా అన్నాడు సైగ చేస్తూ. పదకొండేళ్ల చంద్రుడికి ఆ మాటల అర్థం కాక నిశ్శబ్దంగా నిలబడ్డాడు. డబ్బులు తెచ్చావా లేదా అని బంట్రోతు గద్దించాడు. చంద్రుడు సమాధానం చెప్పకపోవడంతో కోపంగా చంద్రుడి ఫైలును పక్కన పడేసి, మిగతా వాళ్లకు సంతకాలు అయిన సర్టిఫికెట్లు ఇవ్వడం మొదలుపెట్టాడు. అక్కడ దారుణం జరుగుతోంది. ఒక్కొక్కరి నుంచి ఒక్కో పద్ధతిలో లంచం వసూలు చేస్తున్నాడు ఆ బంట్రోతు. కొందరిని గోడ చాటుకు తీసుకెళ్లి డబ్బులు తీసుకుంటున్నాడు, కొందరితో చేతిలో చెయ్యి కలిపి నోట్లు నొక్కుతున్నాడు. ఆకలి, ఎండ, నిస్సహాయత తట్టుకోలేక చంద్రుడు మళ్లీ ధైర్యం చేసి, అయ్యా నా సర్టిఫికెట్ ఇవ్వండి అని అడిగాడు. సరే ఇటు రా అన్నాడు బంట్రోతు. దగ్గరికి వెళ్లడమే ఆలస్యం, ఆ బంట్రోతు రాక్షసంగా చంద్రుడి చొక్కా జేబులో చెయ్యి పెట్టేశాడు. అందులో ఉన్న ఐదు రూపాయల నోటును, చిల్లరను లాగేసుకున్నాడు. చంద్రుడు వెనక్కి జరిగి, చేతిని అడ్డుపెట్టేలోపే ఆ ఘోరం జరిగిపోయింది. ఆ తర్వాత స్టూల్ మీద సర్టిఫికెట్ పెట్టి, సీలు వేసి, ఇదిగో నీ సర్టిఫికెట్ తీసుకో అంటూ విసిరేశాడు.
సర్టిఫికెట్ చేతికొచ్చిందన్న సంతోషం కంటే, తండ్రి కష్టపడి దాచిన ఆఖరి పైసాను కూడా ఆ రాబందు లాగేసుకుందన్న వేదన చంద్రుడిని కుదిపేసింది. కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆ బంట్రోతు కరిగి కనీసం ఇంటికి వెళ్లడానికి బస్సు ఛార్జీ అయినా ఇస్తాడేమోనని ఆశగా చూశాడు. కానీ ఆ కసాయికి లంచాల వేటలో వేరే ధ్యాస లేదు.

## ఆకలి పరుగు... చీకటి ప్రయాణం

అప్పటికే సమయం సాయంత్రం ఐదున్నర అవుతోంది. జేబులో ఒక్క పైసా లేదు. కడుపులో ఆకలి మంటలు ఎగసిపడుతున్నాయి. సొంత ఊరైన కోటపాడుకు వెళ్లాలంటే బస్సు ఛార్జీలు లేవు. అప్పుడు చంద్రుడికి కొలిమిగుండ్ల నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న బెలుం గ్రామంలో నివసించే మేనత్త చిన్న సుబ్బమ్మ గుర్తొచ్చింది. ఇక ఆలస్యం చేయలేదు. సర్టిఫికెట్‌ను జాగ్రత్తగా చుట్టి జేబులో పెట్టుకుని కాళ్లకు పని చెప్పాడు. ఆ దారి నాపరాళ్ల గనుల దారి. సాయంత్రం ఐదు దాటితే అక్కడ మనుషులెవరూ ఉండరు. దారి పొడుగునా గతుకులు, నిర్మానుష్యం తాండవిస్తోంది. చీకటి పడుతోంది, భయం గుండెను పిండేస్తోంది. ఆకలితో శరీరం సహకరించడం లేదు. అయినా చంద్రుడు ఆగలేదు. కొద్దిసేపు పరుగు, ఆయాసం వస్తే కొద్దిసేపు నడక, మళ్లీ పరుగు తీశాడు. గుండెను, సర్టిఫికెట్‌ను అరచేతిలో పెట్టుకుని శ్వాస ఆగిపోయేలా పరిగెత్తాడు. రాత్రి ఆరున్నర ప్రాంతంలో బెలుంలో ఉన్న అత్తగారింటికి చేరుకున్నాడు. దుమ్ము కొట్టుకుపోయిన శరీరం, ఎండిపోయిన పెదవులు, మాట్లాడటానికి కూడా లేని ఓపికతో ఉన్న చంద్రుడిని చూసి మేనత్త ఆశ్చర్యపోయింది. ఒక్కడివే వచ్చావా నాయనా అంటూ నీళ్లిచ్చింది. గబగబా నీళ్లు తాగి మంచం మీద కూలబడ్డాడు. మధ్యాహ్నం తిన్నావా రా అని అత్త అడగగా, లేదు అత్తా, కొలిమిగుండ్ల నుంచి నడుచుకుంటూ, పరిగెత్తుకుంటూ వచ్చాను అని చెప్తుంటే చంద్రుడి కళ్లలో నుంచి కన్నీళ్లు ధారగా కారాయి. జరిగిందంతా విని ఆ అత్త మనసు ద్రవించిపోయింది. వ్యవస్థను శాపిస్తూ, ఏడుస్తూనే చంద్రుడిని గుండెలకు హత్తుకుంది. అన్నం తినిపించి, రాత్రంతా ఆ చిన్నారి కాలి నొప్పులు తగ్గేలా కాళ్లు పిసికింది.

## కోటపాడులో కన్నీటి రాత్రి.

మరుసటి రోజు ఉదయం చంద్రుడు అత్త దగ్గర డబ్బులు తీసుకుని సొంత ఊరికి చేరాడు. కానీ ఆ ముందు రోజు రాత్రి వాళ్ల ఇంట్లో జరిగిన నరకం అప్పుడు తెలిసింది. రాత్రి ఏడు గంటలకు తండ్రి కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చాడు. చిన్నోడు రాలేదా అని భార్యను అడిగాడు. ఇంకా రాలేదు అనగానే, ఆకలి, అలసట మరిచి భుజాన తువ్వాలు వేసుకుని బస్టాండుకు పరిగెత్తాడు. తిమ్మనాయునిపేట నుంచి వచ్చే ఆఖరి బస్సు రాత్రి ఎనిమిది గంటలకు వచ్చింది. ఊరి వాళ్లు దిగారు కానీ అందులో చంద్రుడు లేడు. దిగిన వాళ్లందరినీ ఆత్రుతగా అడిగాడు, అందరి నుంచీ చూడలేదు అనే సమాధానమే వచ్చింది. రాత్రి తొమ్మిది గంటల వరకు బస్టాండులోనే పిచ్చివాడిలా ఎదురుచూశాడు ఆ తండ్రి. ఆ రోజుల్లో ఫోన్లు లేవు, సమాచారం తెలుసుకునే మార్గం లేదు. వేరే బండి మాట్లాడుకుని వెళ్దామంటే అంత స్థోమత లేదు. దిక్కుతోచని స్థితిలో ఏడుస్తూ ఇంటికి వచ్చాడు. తండ్రి ఒక్కడే రావడం చూసి తల్లి గుండె పగిలిపోయింది. పిల్లోడు వస్తే అందరం కలిసి తిందాం అని వండిపెట్టిన అన్నం అలాగే ఉండిపోయింది. ఆ రాత్రంతా ఆ దంపతులకు కంటిమీద కునుకు లేదు. తల్లి బయటకు ఏడుస్తుంటే, తండ్రి గుండెల్లోనే ఏడుస్తూ భార్యకు ధైర్యం చెప్పాడు. మరుసటి రోజు మధ్యాహ్నం చంద్రుడు క్షేమంగా ఇల్లు చేరేవరకు ఆ తల్లిదండ్రులు ఒక్క ముద్ద కూడా నోట్లోకి తీసుకోలేదు.

## ఆ కన్నీళ్లే ఒక కలెక్టర్ ని సృష్టించాయి.

ఒక నిరుపేద బాలుడి ఐదు రూపాయల నోటును దోచుకున్న ఆ ఆఫీస్ బంట్రోతు, ఆ రోజు కేవలం ఒక చిన్నపిల్లాడి జేబును మాత్రమే కొల్లగొట్టలేదు, ఆ బాలుడి ఆత్మగౌరవాన్ని గాయపరిచాడు. కానీ ఆ రోజు కారిన కన్నీళ్లు వృథా పోలేదు. ఆకలితో, భయంతో నాపరాళ్ల బాటలో చంద్రుడు పెట్టిన ప్రతి అడుగూ భవిష్యత్తులో అతను సాధించబోయే ఐఏఎస్ విజయానికి పునాది రాళ్లయ్యాయి. వ్యవస్థలోని అవినీతిని చూసి భయపడి పారిపోకుండా, అదే వ్యవస్థను శాసించే స్థానానికి ఎదగాలనే పట్టుదలను ఆ ఐదు రూపాయల దొంగతనం చంద్రుడిలో నూరిపోసింది. అందుకే గంధం చంద్రుడు గారు కలెక్టర్ అయ్యాక కూడా, ఆఫీసులకు వచ్చే సామాన్యుల పట్ల, ముఖ్యంగా సర్టిఫికెట్ల కోసం వచ్చే విద్యార్థుల పట్ల ఎంతో మానవత్వంతో వ్యవహరించేవారు. అది ఆయన సొంత అనుభవ పాఠం.

---

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి

### అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి -బీఎల్ఓలకు స్వయంగా శిక్షణ ఇచ్చిన జిల్లా కలెక్టర్
### అనర్హుల పేర్లు జాబితాలో చేరకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 09:**
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ 2026 కార్యక్రమాన్ని నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బూత్ స్థాయి అధికారులను (బీఎల్ఓలు) ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమ శిక్షణలో కలెక్టర్ స్వయంగా పాల్గొని బీఎల్ఓలకు సమగ్ర మార్గదర్శకాలు అందించారు. ఓటర్ల నమోదు ప్రక్రియ, ఎన్యూమరేషన్ ఫారాల భర్తీ, క్షేత్రస్థాయి ధృవీకరణ విధానాలు, ఓటరు జాబితా సవరణకు సంబంధించిన నిబంధనలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అనర్హుల పేర్లు జాబితాలో చేరకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని బీఎల్ఓలకు సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఖచ్చితమైన సమాచారంతో ఓటరు జాబితాను రూపొందించాలని తెలిపారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950 ప్రకారం ఓటరు జాబితాల రూపకల్పన, ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 ప్రకారం ఎన్నికల నిర్వహణ జరుగుతుందని వివరించారు.

**తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు**
ఓటర్లు తప్పుడు వివరాలతో డిక్లరేషన్ ఇస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్-31 ప్రకారం



శిక్షార్హులవుతారని తెలిపారు. అలాగే ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం లేదా అధికారిక విధుల ఉల్లంఘనకు పాల్పడిన అధికారులపై సెక్షన్32 కింద కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు.

**ఇంటింటికీ వెళ్లి ఫారాల పంపిణీ**
జూన్ 15 నుంచి ఇంటింటికీ వెళ్లే కార్యక్రమం ప్రారంభమైనప్పటికీ, అప్పటి వరకు వేచి ఉండకుండా వెంటనే ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ చేపట్టాలని బీఎల్ఓలకు సూచించారు. ప్రతి అర్హ ఓటరుకు ఫారం అందేలా చర్యలు తీసుకోవాలని, ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను సమాంతరంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**రాజకీయ పక్షపాతం లేకుండా విధులు నిర్వహించాలి**
ఎన్నికల ప్రక్రియలో పనిచేసే అధికారులు పూర్తిగా తటస్థంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనే భావన కలగకుండా ప్రశాంతంగా, సానుకూల దృక్పథంతో పని చేయాలని సూచించారు.

**ఓటరు నమోదు అర్హతలపై అవగాహన**
ఓటరుగా నమోదు కావడానికి భారతీయ పౌరసత్వం, 01-07-2026 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి కావడం, సంబంధిత ప్రాంతంలో సాధారణ నివాసిగా ఉండటం వంటి అర్హతలు అవసరమని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**జూలై 14 వరకు ఇంటింటి సర్వే**
జూన్ 15 నుంచి జూలై 14 వరకు ఇంటింటి సర్వే నిర్వహించి, ఓటర్ల వివరాలను సేకరించి డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. ఒకే ఫారాన్ని పునరావృతంగా డిజిటలైజ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, డిజిటలైజ్ చేసిన ఫారాలపై స్పష్టమైన గుర్తింపు ఉండాలని తెలిపారు.

**ఫారమ్ తిరిగి రాకపోతే కారణాలు స్పష్టంగా నమోదు చేయాలి**
ఎన్యూమరేషన్ ఫారమ్‌లు తిరిగి రాని సందర్భాల్లో కేవలం నాలుగు కారణాలైన ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ అనే వివరాలను మాత్రమే నమోదు చేయాలని సూచించారు. ఈ వివరాల ఆధారంగా



బూత్ వారీగా ప్రత్యేక జాబితాలు తయారు చేసి ప్రజల అభ్యంతరాల కోసం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

**జూలై 21న డ్రాఫ్ట్ ఓటరు జాబితా**
డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌ను జూలై 21న ప్రచురిస్తామని తెలిపారు. అనంతరం క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందని, ఫారం6 ద్వారా కొత్త ఓటరు నమోదు, ఫారం7 ద్వారా తొలగింపు, ఫారం8 ద్వారా మార్పులు లేదా నియోజకవర్గ మార్పులు చేపట్టవచ్చని వివరించారు.

**సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా**
అన్ని క్లెయిమ్స్, అభ్యంతరాలను పరిష్కరించిన అనంతరం పూర్తి పారదర్శకతతో సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రచురించబడుతుందని కలెక్టర్ తెలిపారు.

**అవసరం లేని పత్రాలు సేకరించవద్దు**
ఎన్యూమరేషన్ ఫారంతో పాటు ఆధార్, రేషన్ కార్డు, పాత ఎపిక్ కార్డు వంటి పత్రాల జిరాక్స్ కాపీలు సేకరించవద్దని సూచించారు. అవసరమైన సందర్భాల్లో మాత్రమే ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు లేదా నివాస ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకటి స్వీకరించాలని చెప్పారు.

**పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి**
జూలై 14లోపు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రతిపాదనలను ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉంటుందని ఈ మేరకు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని స్వయంగా పర్యవేక్షించాలని తాసిల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చూడాలని, అవసరమైతే కేంద్రాల విభజన చేపట్టాలని తెలిపారు. అయితే ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు కేంద్రాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఆర్ఓ లను కలెక్టర్ ఆదేశించారు.

**హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయాలి**
ఏఈఆర్ఓలు అందరూ హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేసి, హెల్ప్‌లైన్ నంబర్ 1950ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సిస్టమ్ గుర్తించిన లోపాలు, వ్యత్యాసాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిచేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఆర్ఓ రాము నాయక్, ఆత్మకూరు ఆర్డీఓ, ఈఆర్ఓ వెంకట శివ, నందికొట్కూరు, మిడుతూరు, పాములపాడు, కొత్తపల్లి, జూపాడుబంగ్లా, పగిడ్యాల మండలాల బీఎల్ఓలు, సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.